క్లుప్తంగా

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

అమలాపురం టౌన్: రాష్ట్రంలోని 10 ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ పేరుతో ప్రైవేటీకరణ చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నారని వామపక్ష నాయకులు అన్నారు. అమలాపురంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జిల్లా సీపీఎం శాఖ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం 3 గంటలకు వైద్య కళాశాలల ప్రైవేటీకరణ అంశంపై చర్చించేందుకు రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రభుత్వ రంగంలోనే వైద్య విద్య, ప్రజారోగ్యం కొనసాగాలని కోరుతూ ఈ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మేధావులు, ప్రజాతంత్రవాదులు, నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు హాజరై తమ అభిప్రాయలను తెలియజేయాలని వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

ప్రపంచ శాంతికి కట్టుబడి ఉండాలి



హిందీ భాషోపాధ్యాయిని సూర్యకుమారిని సత్కరిస్తున్న ఎంఈవోలు

ఐ.పోలవరం: అంతర్జాతీయంగా వివిధ దేశాల మధ్య యుద్ధ వాతావరణం, వివాదాలు తొలగిపోయి, కాల్పుల విరమణతోపాటు శాంతి, సోదర భావాలు నెలకొల్పేందుకు ప్రతి దేశం కట్టుబడి ఉండాలని పలువురు వక్తలు అన్నారు. ఐ.పోలవరం మండల విద్యాశాఖ కార్యాలయంలో పీటీఎం సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ శాంతి దినోత్సవాన్ని నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు డాక్టర్ పులిపు వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీవోలు నల్లిమిల్లి కొండారెడ్డి, వీధి సురేష్ బాబు, ముమ్మిడివరం ఎంఈవో రాయుడు ఉదయభాస్కర్ పాల్గొన్నారు. ఐ.పోలవరం జెడ్పీ ఉన్నత పాఠశాల హిందీ భాషోపాధ్యాయిని అడపా సూర్య కుమారికి 'శాంతి గళం పురస్కారం 2025 ' ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో విత్తనాల ప్రసాద్, వి.శ్రీరాములు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించండి

యానాం: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యానాం నియోజకవర్గ పరిధిలోని రైతులు ఆదివారం పుదుచ్చేరి రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి చౌదరి మహ్మద్ యాసిన్‌ను కలిసి విన్నవించారు. యానాం వచ్చిన ఆయనను స్థానిక ఆర్‌ఏఓ ఆఫీసులో ఫార్మర్స్ అండ్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు మాజేటి సత్యభాస్కర్ ఆధ్వర్యంలో రైతులు కలిశారు. సబ్సిడీపై అందించే ట్రాక్టర్లకు రైతువాటా సొమ్ము చెల్లించి 5 నెలలు కావస్తున్నా ట్రాక్టర్లు మంజూరు చేయలేదని అన్నారు. ఫార్మర్స్ అండ్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ ప్రారంభించనున్న వ్యాపారానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు కోన వెంకట్రావు, రైతులు కొండమూరి భాస్కరరావు, మొలగజ్జల ఆనందరావు, కంచర్ల చిన్నబ్బాయి పాల్గొన్నారు.

బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్లకు శంకుస్థాపన



గాడిమొగలో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుబ్బరాజు

ఐ.పోలవరం/కాట్రేనికోన/తాళ్లరేవు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సముదాయంలో రోగ నిర్ధారణ పరీక్షలు చేయడానికి ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు తెలిపారు. ఆదివారం ఆయన జి. వేమవరం, కాట్రేనికోన, గాడిమొగ పీహెచ్‌సీల పరిధిలో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ (బీపీహెచ్‌యూ) నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ ఓగూరి భాగ్యశ్రీ, గంటి వెంకటసుధాకర్, నడింపల్లి సుబ్బరాజు, ఎంపీపీ రాయుడు సునీత, సర్పంచ్ కామాడి గోవలక్ష్మి, కాంట్రాక్టర్ గొర్రెల శ్రీను, వైద్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు

అమలాపురం రూరల్: పేరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఇటీవల ఏర్పాటు చేసిన అమలాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ విద్యా సంవత్సరంలో రెండవ దశ డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభిస్తామని ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నరసింహ స్వామి తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని అడ్మిషన్ల కన్వీనర్ పి.కరుణశ్రీ తెలిపారు. అడ్మిషన్ల కో కన్వీనర్స్ డాక్టర్ ఎం.బాల స్వామి, డాక్టర్ బి.ఆశిష్ బాబు, అధ్యాపకులు పి. శేఖర్, ఎన్. రాజతేజ, మురళీ కృష్ణ పాల్గొన్నారు. వివరాలకు సెల్ నంబర్లు 9491191635, 9490977555 సంప్రదించాలన్నారు.

ఫాస్ట్‌ఫుడ్ దుకాణాలపై నిఘా ఏదీ?

- లైసెన్స్‌లు లేకుండా వ్యాపారం
- కానరాని తనిఖీలు, నమోదు కాని కేసులు
- స్ట్రీట్ ఫుడ్ నాణ్యతపై అధికారుల పరిశీలన కరవు
- నిబంధనలు పాటించకుంటే ప్రజారోగ్యానికి హాని



అమలాపురంలో రోడ్డు చెంతన తిను బండారాలు విక్రయించే తోపుడు బండ్లు, దుకాణాలు

అమలాపురం టౌన్: రోడ్ల చెంతన, వీధుల్లో ఫాస్ట్ ఫుడ్, టిఫిన్ సెంటర్లు, బజ్జీ, పానీపూరి బండ్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. చిరు వ్యాపారాలు చేసుకునే చిన్న వ్యాపారులనే సానుభూతి చూపి సానుకూలంగా ఉందామన్నా వారు విక్రయించే తిను బండారాలతో ప్రజల ఆరోగ్యాలు గుల్లవుతున్నాయి.

యువతా మేలుకో..

ఆహార పదార్థాలను సరైన నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ తయారు చేసి విక్రయిస్తే ప్రజారోగ్యాన్ని పరిరక్షించడంలో స్ట్రీట్ ఫుడ్ వ్యాపారులూ భాగస్వామ్యులు అవుతారు. అమలాపురం పట్టణం, 216 జాతీయ రహదారి విస్తరించిన పరిసర గ్రామాల రోడ్ల చెంత ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు అనేకం వెలిశాయి. దీనికి తోడు మిరప కాయ బజ్జీలు, న్యూడిల్స్, పానీ పూరి, మాంసపు పకోడీ విక్రయించే తోపుడు బండ్లు ప్రతి వీధిలో దర్శనమిస్తున్నాయి. నూనెను అనేక సార్లు మరిగించి అదే నూనెలో ఆహార పదార్థాలు వేపడం వల్ల ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ ఆహార కాలుష్య కోరల్లో చిక్కుకుంటున్నది తొలుత యువతే. ఇటీవల ముఖ్యంగా యువతీ యువకులు ఏదైనా సుస్తీ చేసి ఆస్పత్రులకు వెళితే తొలుత డాక్టర్లు చెబుతున్నది ఒక్కటే ఫాస్ట్ ఫుడ్, వీధి బళ్లమీద విక్రయించే ఆహారం తీసుకోవద్దని సలహా ఇస్తున్నారు.

ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై ఫుడ్ సేఫ్టీ అధికారులు, మున్సిపాలిటీ అధికారులు, పొల్యూషన్ కంట్రోల్ అధికారుల నిఘా కరువైంది. హోటళ్లపై మాత్రమే దాడులు చేసి తనిఖీ చేస్తున్నారు. తర్వాత రాజకీయ ఒత్తిళ్లతో కేసులు నీరుగార్చేస్తున్నారు. అమలాపురంలో గతేడాది రెండు ప్రముఖ హోటళ్లలో నిల్వ ఆహార పదార్థాల ఉంచారని ఫిర్యాదులు రావడంతో అధికారులు దాడులు చేసి అనంతరం పట్టించుకోలేదు.

120కి పైగా తాత్కాలిక షాపులు, తోపుడు బండ్లు

అమలాపురం పట్టణం, పరిసర గ్రామాల రోడ్ల చెంత తాత్కాలికంగా ఫాస్ట్‌ఫుడ్, న్యూడిల్స్, పానీ పూరి, మాంసపు పకోడీల షాపులు, తోపుడు బండ్లు 120కి పైగా ఉన్నాయి. సాయంత్రం అయితే చాలు వారంతా తమ వ్యాపారాలను మొదలుపెడతారు. మరిగించిన నూనెలో మాంసపు ముక్కలు, మిరప కాయ బజ్జీలు, మాంసపు పకోడీలను వేపడంతో వాటిని తిన్న వారి ఆరోగ్యం క్రమేపీ పెను ప్రమాదంలో పడుతుందని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. ఇక న్యూడిల్స్, పానీపూరి, ఫ్రైడ్ రైస్ షాపులు ఈ కోవలోకే వస్తాయి.తోపుడు బండ్ల వ్యాపారులు, చిరుతిళ్ల విక్రయదారులు సరైన పరిశుభ్రత, నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ప్రజా ఆరోగ్యంతో పరోక్షంగా చెలగాటం ఆడుతున్నారు. ఈ షాపులు, తోపుడు బండ్లపై గ్యాస్ సిలిండర్లు వాడడం, నూనె మరగడం వల్ల వచ్చే పొగతో పట్టణంలో కాలుష్యం కమ్ముకుంటోంది. పట్టణంలో గడియారం స్తంభం సెంటరు, ముమ్మిడివరం గేటు సెంటరు, కలశం సెంటరు, హైస్కూలు సెంటరు, కొంకాపల్లి ఎత్తురోడ్డు, వై. జంక్షన్, ఎర్ర వంతెన, నల్ల వంతెన రోడ్లు, మొబర్లీ పేట ఇలా చెప్పుకుంటూ పోతే ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, రెడీమేడ్ ఆహార పదార్థాలు విక్రయించే తోపుడు బండ్లు అనేకం దర్శనమిస్తాయి.

దృష్టి సారించని అధికారులు

మున్సిపాలిటీ పరంగా శానిటేషన్, ఎన్విరాల్‌మెంట్ విభాగం అధికారులకు ఈ సెంటర్లు, షాపులను తనిఖీ చేసే అధికారం ఉన్నా వారు ప్లాస్టిక్ కవర్లు తదితర సామగ్రిపైనే దృష్టి పెట్టి దాడులు చేస్తున్నారే తప్ప కల్తీ ఆహారం విక్రయాలు, కాలుష్యంపై దృష్టి సారించడం లేదు. ఫుడ్‌సేఫ్టీ డిపార్ట్‌మెంట్ అధికారులు ఈ తరహా దుకాణాలను తనిఖీలు చేస్తే నిర్వాహకులకు కనీసం భయమైనా ఉంటుంది. ఈ దుకాణాల నిర్వహణకు ఎవరూ లైసెన్సులు తీసుకోవడం లేదు. కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులు ఈ తరహా దుకాణాలు, తోపుడు బండ్ల వల్ల కలిగే కాలుష్య సమస్యపై పర్యవేక్షించడం లేదు. ఇలా ఎవరికి వారు ఆయా శాఖల అధికారులు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, రెడీమేడ్ ఆహార పదార్థాలు విక్రయించే తోపుడు బండ్లపై నిఘా పెట్టకపోవడంతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. వ్యాపారులు ఫుడ్ కలర్స్, టేస్టింగ్ సాల్ట్ ఆహార ఉత్పత్తుల్లో రంగు, రుచి కోసం అధికంగా ఉపయోగిస్తున్నారు. ఇవి మోతాదు మించితే ఆరోగ్యంపై తీవ్ర నష్టం కలిగిస్తాయి.

వీధి వ్యాపారులు విధిగా లైసెన్సులు పొందాలి

"ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, రోడ్ల చెంత తిను బండారాలు విక్రయించే ప్రతి వీధి వ్యాపారి తప్పని సరిగా లైసెన్స్‌లు పొందాలి. ఇప్పటికే రోడ్ల చెంత తినుబండారాలు విక్రయించే స్ట్రీట్ ఫుడ్ వెండర్లు, దుకాణాలను తనిఖీలు చేస్తున్నాం. ఇకపై స్పెషల్ డ్రైవ్ తరహాలో ఈ తోపుడు బండ్లు, దుకాణాలపై నిఘా పెంచుతాం. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించేలా, కాలుష్యం కలిగించేలా వ్యాపారులు వ్యవహరిస్తే వారిపై కేసులు పెట్టి చర్యలు తీసుకుంటాం."

– వై.రామయ్య, ఫుడ్ సేఫ్టీ అధికారి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

దసరా ఉత్సవాలకు సర్వం సిద్ధం

- అమ్మవారి ఆలయాల వద్ద చలువ పందిళ్ల నిర్మాణం
- అమలాపురంలోని శ్రీదేవి, వాసవీ మాత ఆలయాల్లో భారీ ఏర్పాట్లు



అమలాపురంలోని శ్రీదేవి అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన భారీ సెట్టింగ్



శ్రీదేవి అమ్మవారి ఆలయం వద్ద నిర్మించిన చలువ పందిరి లోపల అలంకరణ



పూజలందుకునేందుకు ముస్తాబైన దుర్గమ్మ విగ్రహాలు

అమలాపురం టౌన్: విజయ దశమి నవరాత్రి మహోత్సవాలకు అమలాపురంలోని కనకదుర్గ, వాసవీ మాత, శ్రీదేవి అమ్మవార్ల ఆలయాలను ఆదివారం సాయంత్రానికే అలంకరించారు. చలువ పందిళ్లు తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి. పట్టణంలోని శ్రీదేవి మార్కెట్‌లోని శ్రీదేవి అమ్మవారి ఆలయం, వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయం, వేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలోని కనకదుర్గ ఆలయంతోపాటు హౌసింగ్ బోర్డు కాలనీ, గోఖలే సెంటరు, యునైటెడ్ ఆస్పత్రి వద్ద, నారాయణపేట, కొంకాపల్లి, కార్మిక నగర్, సూర్యనగర్, గాంధీ నగర్, వెత్సావారి అగ్రహారం తదితర ప్రాంతాల్లోని కనకదుర్గ ఆలయాల్లో దేవీ నవరాత్రి ఉత్సవాలకు ఘనంగా నిర్వహించనున్నారు.

మార్కెట్ ప్రాంతంలో వైభవంగా ఉత్సవాలు

మార్కెట్ ప్రాంతం తదితర చోట్ల కూడా దుర్గాదేవిని ప్రతిష్ఠించేందుకు చలువ పందిళ్లు నిర్మించారు. శ్రీదేవి అమ్మ వారి ఆలయం వద్ద ఏటా దసరా ఉత్సవాలకు ఓ ప్రత్యేకత సంతరించుకుంటుంది. ఈ ఆలయం వద్ద నిర్మించిన చలువు పందిరి ఆకట్టుకునేలా సుందరంగా అలంకరించారు. భారీ సెట్టింగ్‌లు, విద్యుద్దీపాలంకరణ ఏర్పాటు చేశారు. అమ్మవారి సన్నిధిలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 9 రోజులపాటు హోమాలు, కుంకుమ పూజలు నిర్వహిస్తారు. ఆలయం వద్ద ప్రతి రోజూ రాత్రి పలు సాంస్కృతిక, పౌరాణిక నాటకాల ప్రదర్శన ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. నవరాత్రి ఉత్సవాలు ముగిశాక చివర్లో అమ్మవారి నిమజ్జన ఊరేగింపులో పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయడం సంప్రదాయంగా వస్తోంది. దాదాపు రూ.10 లక్షల వ్యయంతో శ్రీదేవి అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయం ఉత్సవ కమిటీ అమ్మవారి దసరా ఉత్సవాలు ఏటా ఘనంగా నిర్వహిస్తోంది. 108 కలశాలతో జలాభిషేకం, 102 మంది కన్యలతో కలశ పూజ, రూ.3 కోట్ల కొత్త కరెన్సీతో అమ్మవారికి దివ్య అలంకరణకు ఏర్పాట్లు చేశారు.

పలు ఆలయాల వద్ద చలువ పందిళ్ల ఏర్పాటు

ముమ్మిడివరం: నియోజకవర్గంలో శ్రీదేవీ శరన్నవ రాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ముమ్మర ఏర్పాట్లు చేశారు. నేటి నుంచి అక్టోబర్ 2 వరకు ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు గ్రామాల్లోని ఆలయాల వద్ద చలువ పందిళ్లు వేసి విద్యుత్ దీపాలంకరణతో సుందరంగా తీర్చిదిద్దారు. ముఖ్య కూడలిలో అమ్మవారి ప్రతిమలను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు సిద్ధమవుతున్నాయి. ముమ్మిడివరం మార్కెట్ సెంటర్, జగతావారిపాలెం, రాజుపాలెం, క్రాపచింతలపూడి అయినాపురం, సోమిదేవరపాలెం, లక్ష్మీదేవి లంక కర్రివానిరేవు, ఠానేల్లంక, గేదిల్లంక తోపాటు పలు గ్రామాల్లో కనకదుర్గమ్మ ఆలయాల్లో అమ్మవారికి ప్రతి రోజు ప్రత్యేక అలంకరణతో పాటు ప్రత్యేక పూజలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

సిద్ధమైన అమ్మవారి ప్రతిమలు

విగ్రహాల తయారీకి ప్రసిద్ధి చెందిన గాడిలంకలో కనకుదుర్గమ్మ విగ్రహాలు రూపు దిద్దుకున్నాయి. మట్టి, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసే ఈ ప్రతిమలకు వివిధ రంగులతో కళాత్మకంగా రూపు దిద్దుకున్నాయి. విగ్రహాలను కమిటీ నిర్వాహకులు కొనుగోలు చేసి చలువ పందిళ్లలో ప్రతిష్ఠించి అమ్మవారికి శరన్నవరాత్రులు ప్రత్యేక అలంకరణలతో పాటు విశేష పూజలు నిర్వహించనున్నారు.

వైఎస్సార్ సీపీ నేతలకు సత్కారం



రాజేష్‌ను సత్కరించి అభినందిస్తున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు



జున్నూరి రామారావును అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర మున్సిపల్ విభాగం సంయుక్త కార్యదర్శిగా నియమితులైన అమలాపురం మున్సిపల్ వార్డు కౌన్సిలర్ గొవ్వాల రాజేష్‌ను స్థానిక సుబ్బారాయుడు చెరువు సెంటరులో పార్టీ నాయకులు ఆదివారం అభినందించి ఘనంగా సత్కరించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ముమ్మిడివరం, మండపేట నియోజకవర్గాల పార్టీ పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రాజేష్‌ను సత్కరించారు. పార్టీ కౌన్సిలర్ దొమ్మేటి రాము, పార్టీ జిల్లా కార్యదర్శి కముజు రమణ, పార్టీ నాయకులు దొంగ చిన్నా, చెల్లుబోయిన నాని, కొప్పిశెట్టి నరసింహమూర్తి, పాటి శ్రీరామ్, దొంగ బాలాజీ, ఇళ్ల కిషోర్, బొక్కా ఏడుకొండలు తదితరుల రాజేష్‌ను అభినందించారు.

రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షుడికి సత్కారం

అల్లవరం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగ అధ్యక్షుడిగా ఎంపికైన జున్నూరి రామారావును వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు అల్లవరం మండలం డి.రావులపాలెంలోని ఆయన నివాసంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఆయన వెంట కౌన్సిలర్లు దొమ్మేటి రాము, నడిపూడి సర్పంచ్ చెల్లుబోయిన నాని, జిల్లా కార్యదర్శి కముజు రమణ, పార్టీ నాయకులు దొంగ చిన్న, బొక్కా ఏడుకొండలు, పాటి శ్రీరామ్ ఉన్నారు.

కూటమి ప్రభుత్వ విధానాలపై పోరాటం



రామకృష్ణను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు

అమలాపురం రూరల్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శిగా నియమితులైన సరేళ్ల రామకృష్ణను వైఎస్సార్ సీపీ నాయకులు అభినందించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, ముమ్మిడివరం, మండపేట పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి కముజు రమణ సర్పంచ్ చెల్లుబోయిన నాని, కౌన్సిలర్ దొమ్మేటి రాము, పార్టీ నాయకులు దొంగ చిన్న, పాటి శ్రీరామ్, దొంగ బాలాజీ, పాటి రవి తదితరులు రామకృష్ణను బండారులంకలో ఆదివారం కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం కొనసాగించాలన్నారు. ఈ సందర్భంగా మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, పార్లమెంట్ పరిశీలకులు పినిపే విశ్వరూప్, అమలాపురం నియోజకవర్గం కోఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్‌కు రామకృష్ణ ధన్యవాదాలు తెలిపారు.

లక్ష్మణస్వామికి పలువురి అభినందనలు



మాజీ ఎమ్మెల్యే పొన్నాడను సత్కరిస్తున్న లక్ష్మణస్వామి

తాళ్లరేవు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర బూత్ విభాగం జాయింట్ సెక్రటరీగా నియమితులైన కాశి లక్ష్మణ స్వామికి పలువురు అభినందనలు తెలిపారు. రాష్ట్ర పదవికి ఎంపికైన లక్ష్మణస్వామి ఆదివారం మర్యాద పూర్వకంగా మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌ను కలిశారు. తనను రాష్ట్ర పదవికి ఎంపిక చేసిన పొన్నాడను లక్ష్మణస్వామి దుశ్శాలువా, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా పొన్నాడ లక్ష్మణస్వామిని అభినందించి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని పొన్నాడ కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్, మండల నాయకులు బొంతు మోహన్, దడాల జగదీశ్వరరావు, నీలపాల శ్రీను, నేల శ్రీను, ముర్రే అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత



అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న రాజ్యాంగ పరిరక్షణ సమితి ప్రతినిధులు

ఐ.పోలవరం: భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాజ్యాంగ పరిరక్షణ సమితి పేర్కొంది. ఐ.పోలవరం మండలం కేశనకుర్రు పంచాయతీ పరిధిలో జై బుద్ధ నగర్, జై భీమ్‌నగర్ తదితర గ్రామాల్లో ఆదివారం 'గడప గడపకూ భారత రాజ్యాంగం' కార్యక్రమంలో భాగంగా రాజ్యాంగంపై సదస్సు నిర్వహించారు.

తొలుత ఆయా గ్రామాల్లోని డాక్టర్ అంబేడ్కర్ నిలువెత్తు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం యలమంచిలి సురేష్ అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రాల్లో మనువాద, మతోన్మాద ప్రభుత్వాలు రాజ్యాంగం కల్పించిన పౌరుల హక్కులను కాలరాస్తున్నాయన్నారు. బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీలు, మహిళలు సంఘటితమై రాజ్యాంగ పరిరక్షణకు చైతన్యవంతమైన పాత్రను పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కుంచే చినబాబు, తాటిపాక దుర్గబాబు, శరత్, మోర్త ధన కాసులు, గిడ్ల రమేష్, వాకపల్లి వెంకటరత్నం, పి.అర్జున రావు, గెల్లా రాజేంద్ర, ములపర్తి కాంతరావు, మహిళలు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ సైన్సెస్‌లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం రూరల్: అంతర్జాతీయ క్రీడాకారులకు భారత క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో పూణేలో నేతాజీ సుభాష్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ ద్వారా స్పోర్ట్స్ సైన్సెస్‌లో శిక్షణ ఇవ్వడానికి అర్హులైన అంతర్జాతీయ క్రీడాకారుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతునట్లు కోనసీమ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయం తెలిపింది. ఎన్ఎస్ఐ సర్టిఫికెట్ కోసం వివిధ కోర్సుల్లో జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో పూనే ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణకు ఉంటుందన్నారు. ఈనెల 25 తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని, హెల్ప్‌లైన్ 01752394351 సంప్రదించాలన్నారు.

ఆదుకోవాలని ఎమ్మెల్యేకు వినతి

తాళ్లరేవు: తమ కుమార్తె వినికిడిలోపంతో పుట్టిందని, ఆమెకు వినికిడి యంత్రం కొనుగోలు చేసేందుకు సహకరించాలని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజును బాలిక తల్లిదండ్రులు కోరారు. ఆదివారం గాడిమొగకు వచ్చిన ఎమ్మెల్యేను బాలిక తల్లిదండ్రులు కలిసి తమ గోడును వివరించారు. ఎనిమిదవ తరగతి చదువుతున్న యామిని సాయి వినికిడిలోపం నివారణకు పదేళ్ల క్రితం సర్జరీ చేయించామని, సర్జరీ చేసి వినికిడి యంత్రాన్ని అమర్చారని తెలిపారు. ప్రస్తుతం ఆ యంత్రం పనిచేయడం లేదని, కొత్తది కొనాలంటే సుమారు రూ.6 లక్షలు ఖర్చవుతుందని, తాము ఖర్చు భరించలేమని వాపోయారు. వినికిడి యంత్రం లేకపోవడంతో యామిని సాయి పాఠశాలకు వెళ్లడంలేదని, సహాయం చేయాలని ఎమ్మెల్యేను కోరారు.

ప్రశాంతంగా వీఏఓ రాత పరీక్ష



పరీక్షా కేంద్రంలో అభ్యర్థుల హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది

యానాం: పుదుచ్చేరి రెవెన్యూ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ శాఖలో ఖాళీగా ఉన్న విలేజ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (వీఏఓ) ఉద్యోగాల భర్తీకి ఆదివారం నిర్వహించిన రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. నియోజకవర్గ పరిధిలో రాత పరీక్ష కోసం 6 కేంద్రాలను ఏర్పాటు చేశారు. 1,919 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో పురుష అభ్యర్థులు 827 మంది, మహిళలు 633 మంది మొత్తం 1,460 మంది పరీక్షకు హాజరయ్యారని, 459 మంది గైర్హాజరైనట్లు రీజినల్ అడ్మినిస్ట్రేటర్, ఐఏఎస్ అధికారి అంకిత్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి యాసిన్‌చౌదరి, అండర్ సెక్రటరీ మురుగేషన్, డీటీ జ్యోతుల వెంకటేశ్వరరావు, సీఐ అడలరసన్, ఎస్సై పునీత్‌రాజ్ పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం

అమలాపురం రూరల్: బండారులంక పేరి రామేశ్వర శర్మ, బాసిన గంగరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అదనపు భవనం నిర్మాణం కోసం మోగావైడ్ కంపెనీ యాజమాన్యం రూ.30 లక్షల నిధులు మంజూరు చేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ నిధులు మంజూరుకు కృషి చేసిన స్థల దాత పేరి శ్రీనివాస శర్మను మాజీ జెడ్పీటీసీ సభ్యుడు, శ్రీశైలం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి, సర్పంచ్ సునీత ఏడుకొండలు, పిచ్చిక వెంకన్న తదితరులు ఘనంగా సత్కరించారు. మోగావైడ్ కంపెనీ యాజమాన్యం నిధులు మంజూరు పత్రాలను డీఈఓ సలీమ్ భాష, హెచ్ఎం ఎస్ఎల్‌వీ బాలకు అందించారు.



అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

తాచుపాము హల్‌చల్



పామును బంధించేందుకు యత్నిస్తున్న స్నేక్ క్యాచర్

ముమ్మిడివరం: కొమానపల్లి కావూరి చంటమ్మ ఇంట్లో ఆదివారం ఆరడుగుల తాచుపాము హల్‌చల్ చేసింది. తాచుపాము సంచరించడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు భయాందోళనకు గురయ్యారు. దీంతో భీమనపల్లికి చెందిన స్నేక్ క్యాచర్ వర్మకు సమాచారం ఇవ్వడంతో అతను అక్కడికి చేరుకుని పామును చాకచక్యంగా ప్లాస్టిక్ డబ్బాలో బంధించడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

ట్రాక్టర్లు, పవర్ టిల్లర్ల పంపిణీ



రైతులకు ట్రాక్టర్లు పంపిణీ చేసిన ఐఏఎస్ అధికారి అంకిత్‌కుమార్

యానాం: నియోజకవర్గ పరిధిలోని ఎస్సీ రైతులకు కేంద్ర ప్రభుత్వ పథకం సబ్‌మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకనైజేషన్ (ఎస్ఎంఏఎం) ద్వారా మంజూరైన ట్రాక్టర్ల, పవర్ టిల్లర్లను ఆర్ఏఓ, ఐఏఎస్ అధికారి అంకిత్‌కుమార్ పంపిణీ చేశారు. స్థానిక ప్రభుత్వ అతిథి గృహం వద్ద డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్, ఫార్మర్స్ వెల్ఫేర్, యానాం శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ రైతాంగానికి ప్రభుత్వం ద్వారా అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యవసాయశాఖ డీడీ శివసుబ్రహ్మణ్యన్, రిటైర్డ్ ఏఏఓ కె.సుబ్బారావు, డిమానిస్ట్రేషన్ అసిస్టెంట్ సీహెచ్‌టీ విజయకుమార్, రైతులు పాల్గొన్నారు.

నలుగురు యువకులకు విద్యుదాఘాతం

అమలాపురం టౌన్: స్థానిక కార్మిక నగర్‌లో దసరా ఉత్సవాల కోసం ఆదివారం సాయంత్రం చేస్తున్న ఏర్పాట్లలో కొద్దిపాటి అపశృతి చోటుచేసుకుంది. పందిరి నిర్మించి ఫ్లెక్సీ కడుతున్న సమయంలో విద్యుదాఘాతానికి గురై నలుగురు యువకులు గాయపడ్డారు. పందిరికి ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తున్న సమయంలో ఫ్లెక్సీ ఇనుప చట్రానికి హైవోల్టేజీ తీగలు తగలి విద్యుదాఘాతానికి యువకులు గురయ్యారు. ప్రమాద తీవ్రత తక్కువగా ఉండడంతో విద్యుదాఘాతానికి గురైన యువకులు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ప్రమాదంలో గుంజే చిన్నా, చక్కా నరసింహం, వల్లెపు రాజేష్, కొమరి వెంకటేష్ గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మాజీ కౌన్సిలర్ భాస్కర్ల రామకృష్ణ, నాయకులు కొప్పుల బాబి, ఆకుమర్తి రాజు ఘటనా స్థలానికి చేరుకుని కార్మిక నగర్ వాసులతో మాట్లాడారు.ఈ ప్రమాదంలో ఇద్దరు స్వల్పంగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారని, వారి ఆరోగ్య పరస్థితి మెరుగ్గానే ఉందని కొప్పుల బాబి తెలిపారు.